# ఎర్రి ఎయ్యి రకాలు

మాది మిద్దూరు గదా?

నాకా ఊళ్లోనుండి మోసుకో నొచ్చేదానికి ముల్లెలూ లేవు. నా కోసం ఎదురు చూసే మల్లెలూ లేవు. అయినా అది ఒక మునాస. ఆ ఊరికి పోవాలనే మునాస. ఎప్పుడైనా అట్టామాదిర మునాస పడి మా ఊరికిపోతే ఆకుప్పకాట్లో పొద్దుపొయ్యేది శానా కష్టం. అందుకని పేపరొగిటి కొనుక్కోని పొయ్యేటోణ్ణి. దాన్ని శాత బట్టుకోని నా సావాసకాపు వెంకటరెడ్డిని ఎంటేసుకోని మిద్దూరికి గెంటాణపల్లికి, గెంటాణపల్లికి మిద్దూరికి అల్లిబిల్లి తిరిగినట్టు తిరగతావుంటే-

''ఆడబోతా వుండేదెవుడు? మిద్దింటోళ్ల పిల్లగాడు గదా? అవునే!'' అని ఊళ్లా వాళ్ల అంటావుంటే నా జంబం జబల్‌పూర్‌దాకా పొయ్యేది. అట్టాంటప్పుడు మా అయ్యకంట్లో గానపడ్తే-

''ఒరే అబ్బోడా! యిట్ట రారా!'' అని శానా ముదిగారం వొలకబోస్తా పిల్సేటోడు. చీటికీ మాటికీ చిటపటలాడే మణిసి సీమంత ముదిగారం చూపించే కుందికి నా గుండికాయి పరవగుట్ట మిందెక్కి పరవశించి నట్టనిపించేది. ఆ కుశాలతోనే ఆయిన దగ్గిరికిబోతే-

''ఆ చేతిలో ఉండేదేందిరా?'' అని అడిగేవాడు.

''నూస్‌పేపర్ గదా?'' అంటే-

'' ఈ పొద్దు న్యూస్‌పేపర్. రేపు?'' అంటా నిలదీసే వాడు.

''ఈ పొద్దు న్యూస్‌పేపరయింది రేపెట్టా కాకుండాపోతింది? ఇచ్చిత్రంగా ఉందే! –'' అని మినకరిస్తావుంటే–

''రేపటికిది ఏస్ట్ పేపర్ గదరా?'' అంటా పకపకా నవ్వేవాడు.

''అంతో యింతో చదువుకున్నోణ్ణి. ఆడా యాడా తిరిగి అంతో యింతో అనుబోగం కలిగినోణ్ణి గదా నాకు తట్లేదే? ఈ ఎద్దలగొట్టి ముద్దలు తినే మణిసికెట్టా తట్టిందబ్బా?'' అని రెప్పార్చకుండా చూస్తావుంటే–

''ఒరే నీమొకాన మజ్జిగ పుల్సు గొట్టా. దాంట్లో యావుండాదిరా? వాడిట్టా... ఈడిట్టా... వాడు దారబోసుకుండె... ఈడు సంపాయించుకుండె... ఈడు ఎగబడిపాయ... వాడు దిగబడిపాయ– యిటుమంటివే గదంట్రా దాంట్లో ఉండేది. ఎవుడెట్టాబోతే మనకేముండాది? మనబతుకులు మనవిగదరా! ఆ బతుకులుండేది యాడ? ఆ కయ్యాగాలవ కాడ! ఆడికిబొయ్ పారో గెడ్డపారో శాతబట్టుకుంటే కుండలో కన్నిగింజిలు.. గాట్లో కంత కసువు. అది వొదిలిపెటేసి కూసేగాడిదొచ్చి మేసేగాడ్డిని చెర్సె నన్నెట్టు నువ్వొకడొచ్చి ఈణ్ణిట్టా ఎంటేసుకోని తిరగతా ఉండావే!'' అని యిదిలించి పారేసే వాడు.

''ఎప్పుడూయీ అడ్డదిడ్డం మణిసి మాట్లాడేది యింతేకదా? ఎట్నోవొకట్టా అడ్డంకొట్టకపోతే ఎట్టబ్బా?'' అని ఆలోచించుకుంటా వుంటే నాచేతిలో వుండే పేపర్ను సరక్కమని చేతిలోకి గుంజుకోని–

''ఒరే అబ్బోడా! ఈ కాకితంమింద వొక్కసారి రాసేస్తే మల్లా ఈ కాకితం పనికొస్తిందా? పోనీ! వొకసారి అచ్చేసినా అంతేగదా? కానీ బూవమ్మతల్లి అట్టగాదే? దున్నేకుందికి దుక్కి. చేసేకుందికి సేద్దెం. ఈ బూవమ్మతల్లే కాకితం అనుకో. నువ్వుపట్టే కలమే మడక అనుకో. రాసే అచ్చిరాలే యిత్తే యిత్తనాలనుకో. అవ్వి ఎప్పుడన్నా ఏస్ట్ అవతాయా?'' అని చెవట సారాన్ని తీసి గీతాసారానికి ముడేసే వాడు!

ఇదంతా అప్పుడెప్పుడో ముప్పయి నలబై ఏండ్ల కిందట మా అయ్య మోటుయాసణ్ణం అనిపించినా యిప్పుడా నాలూగ్గాల్లమండపంకాడ చూడు... కోనేటి కట్టకాడ చూడు... కొర్లగుంట్లో చూడు... యాడచూసినా మా అయ్యచెప్పిన బతుకుసత్తెం అచ్చుగుద్దినట్టు అవుపిస్తానే ఉండాది.

లేకుండాబోతే ఎమ్జియార్ పెండ్లాం ఏడిస్తే ఈళ్ళకేం? జయలలిత ఏ సీకిపాదలో చిగులుకుంటే ఈళ్ళకేం? ఎమ్జియార్ పెండ్లాం యాడస్తా ఉండాదని కొందురు బోరోమని యాడస్తా ఉండారు. ఇంకొందురు జయలలిత ఈ పొద్దే ముక్కెమంత్రి అయిపాయ్‌నట్టు గొంతు కోసేసిన కోళ్ళమాదిర ఎగిరెగిరి పడ్తా ఉండారు. అరెరె! ఎట్టబ్బా ఈ మణుసుల్తో? –

ఎందురో మహన్నబావులు! బొందిలో పాణాలుండేదాక పోరకలాడ్రి. సొతంత్రాన్ని

తెచ్చిరి. తెచ్చి ఎన్నేండ్లయింది. ఈ నలభైఏండ్ల పొడగనా యీళ్లు ఏంచేసినట్టు? తినేదానికి తిండిలేకుండా కొందురు... తినింది అరక్కుండా కొందురు యాడస్తా ఉండారేగానీ మన లాగేమీ బాగేమని ఎవుడైనా ఒక వక్కపొలుకు కొరికినంత సేపు ఆలోచించినాడా?

అదే జపానోడు చూడు. వాడెంత వాడి అనేబారమెంత? మనమోటబాన. కనాగష్టం అంత ఉంటిందా వాడి దేశిమంతా కల్పి. అయినా మొనగోడు. డీకొంటే కొండల్తోనే డీకొనాలని ఏకంగా యాడికేసినాడు నిచ్చిన? అమెరికా వాడ్తోనే పోటీపడాలని ఏసినాడు. ఆ మాటకొస్తే మనంగూడా పోటీపడ్తా ఉండ్లా? ఏమిటికి? అడక్కతినే దానికి! చెప్పుకుంటే సిగ్గుచేటు!

ఈ మాత్రం సిగ్గూసెరము చీమునెత్తురూ ఈ గెడ్డమింద పుట్నోడికి ఎవుడికైనా వుంటే యాలాదివమంది యిట్టా టైం ఏస్ట్ చేస్తారా? వాళ్లకేం? లచ్చలకు లచ్చలు తీసుకుంటారు. జిల్లాంకోడి ఆట మాదిర ఆడుకుంటారు. కొండమింద కోతులు అర్చినట్టు అరస్తా ఎగర్తా వాళ్లు ఆడ్తావుంటే చూసేదెంతమంది? పనీపాటా యిడ్సిపెట్టేసి ఆ పంగమాల్నె ఆటచూస్తా కూసోనుండే వాళ్లను చూస్తావుంటే కడుపు అట్నే తరక్కపోతింది. ఇంక దేశిం ముందుకు పొమ్మంటే?... ఆ! పోవాల్సిందే పొద్దుబొయ్‌నాక!

వాళ్లకత ఆడికి యిడ్సి పెట్టేస్తే ఆడే చోటికేపొయ్ చూసేవోళ్లకత? టీవీలముందర కోసోని కొందురు... చెవలకాడ అరిసేతంత రేడియోలు పెట్టుకోని కొందురు. పొద్దు పోగొట్టా ఉంటే ఈళ్ల బుద్దులంతా ఏమయిపొయ్‌నట్టు అనిపిస్తింది.

అయినా అదేం పిచ్చో పాడుపిచ్చి. చేసేవాడు చేసిపోతే ఊరికే ఉండేవాడు వొగిరించినట్టు ఆడెవుడో ఆడలేక మద్దెల మింద బడి మొత్తుకుంటా ఉంటే ఈడ చేరుకోని యీళ్లకతలు చూడలేమే? తలతలా కొట్టుకునేవాళ్లు కొందురు.. కడుపు గుద్దుకునే వాళ్లు కొందురు... చీది చీది యేసేవాళ్లు కొందురు!

అంతా అరుసోద్దింగా ఉండాది. చూడబోతే లోకానికంతా యీళ్లే ఆడినట్టుండాది. ఆ మాటకొస్తే చిన్నప్పుడు మేముగూడా ఆడుండ్లా? ఓయబ్బా? ఒగిటా? రొండా?- జిల్లాంగోడి... గెచ్చకాయలు... గోలీలు... ఉప్పరపట్టి... చెడుగుడు. ఓపినన్ని. అయితే యిట్టా మాదిర పంగలేని మంగలోడు పిల్లితలకాయి గొరిగినట్టు కాదబ్బా? ఆ పూటకు పనిగనీ ముగించుకోని.. గొడ్లకు తవుడుబెట్టి.. కుడ్తి చూపి గాటినిండా కసువేసి యింక అప్పుడు యీదిలమింద పడేవాళ్లం!

పండు ఎన్నెల. పిండరబోసినట్టు కాస్తావుంటే మేము చెడుగుడు గుక్కబట్టి కూస్తావుంటే... అమ్మలక్కలు తిన్నెలమింద కూసోని చూస్తావుంటే... ఆకేసుకో వక్కేసుకో చాలకుంటే నన్నేసుకో- అన్నెట్టు ఎందుకులే? అది చూడాల్నేగానీ యిట్టని యివరించే దానికయితిందా? అయ్యో అయ్యో! యిట్టామాదిర పంగమాల్నె ఆటలయ్యుంటేనా మా అయ్య చెప్పుతో కొట్టి సెడగొపరం పెట్టించేవాడు. ఇప్పుడూ ఉండారు పెద్దోళ్లు! మనవల్ను ఉద్దరించే మొనగోళ్లు! ఏమిటికి? ఆడించి ఏడిక చూసే దానికి! ఈ ఏడికలన్నీ మనం

చూస్తాకూసోనుంటే మన ఏడుపులన్నీ వాళ్లకు ఏడికలుగా ఉండాయ్.

మణుసులో ఆలోచన పడగూడదు. పడ్తే గెచ్చకాయిల కుండలో చెయ్యేసి కలబెట్టి నట్టే! మణుసంతా గందరగోళంగా ఉండాది. ఎట్టెట్నో పోతావుండాది. ఇంక యింట్లో కాలునిలదొక్కుకణ్ణా నిలవదు. ఎలబార్నా. ఎలబార్తే యాడికి పోవాల? ఉండ్లా నాలుగ్కాళ్లమండపం! ఆడికిబొయ్ చూడబోతే అద్దోనం చెదులుమద్దెంగా ఉండాది.

పొద్దు బారడెక్కలా. తెల్లారేకుందికి ఆడ చేరాల్సిన వాళ్లింకా చేర్లా. అప్పిటికే యిద్దురు గుర్రాలెక్కేసి ఉండారు. వాళ్లవాళ్లే వాళ్లకు తెలవని పరిచ్చితి!

''నువ్వెంతరా అంటే నువ్వెంతరా?'' అంటా నోరుపారేసుకుంటా కొవ్వెక్కిన పొట్టేళ్ల మాదిర ఒకడి మిందికొకడు దూర్తా ఉండారు. అప్పుడప్పుడే ఆడికి చేర్తా ఉండేవాళ్లు చుట్టూరాచేరి ఏడిక చూస్తా ఉండారు.

వాడెవుడో ఒకడు తెల్సినమొకంగా ఉంటే 'ఏందిరా అబ్బారే?' అని అడిగితి.

''జానకి జయలలిత కొట్లాట!'' అనేసి వాడి దోవన వాడు పాయ.

''ఇదేందిది యిచ్చిత్రంగా ఉండాదే? జానకెక్కడ? జయలలితెక్కడ? నాలుగ్కాళ్లమండపం ఎక్కడ? అని ఆలోచించుకుంటా నిలువుగుడ్లేసి నిలబడుకోనుంటే వాడెవుడో యింకొకడు-

''సవుతుల కొట్లాట గదా? ఎవుడికిష్టం వచ్చినట్టు వాడు సాగబెరికితే అది సాగి సాగి ఊరూనాళ్ల మింద పడ్తా ఊరేగి యీడిదాకా వచ్చింది!'' అంటా వాడు చల్లంగా జారుకుండె.

నలుగుర్తో నారాయణని నేనుగూడా ఆయిచ్చిత్రాన్ని చూస్తా ఉండా. నాదోవ ఎట్టబాయనో దొంగలు దోలిపాయ. అంతలేకే ఒక ఆడమణిసి సివ్వమాదిర్తో దూసుకోనొచ్చి ఆ గుంపులో జొరబడి ఒకణ్ణి లగుసుకుండె.

''ఇడ్సి పెట్టే నీయమ్మా నాయాలి ముండా!'' అని వాడు యిదిలించి యిదిలించి కొట్తావుంటే-

'' నువ్వీ పొద్దు పనికి పోకపోతే పాయ్‌నావు. ఎవురేడ కొట్లబోతే మనకెందుకే? కొట్టుకోనిబోతే మనకెందుకే? నీకు దణ్ణం పెడ్తాను. కొంపకు బోదాంరాయే!'' అంటా ఆ ఆడమణిసి పెనుగులాడ్తా ఉండాది.

''ఇప్పుడు ఆడేం కొంపలు మునిగి పోతా ఉండాయని కొంపకు రమ్మంటావే?''

''ఇప్పుడు యీడేం కొంపలు అంటకపోతా ఉండాయని?''

''సిన్నంగంటావా ఆ మాట? నీకేం తెల్సునే... నీ...''

'' నాకు తెల్దు. నీకు తెల్సు. అందుకే నామానం దీసి...''

''నోర్మూయ్యే నీయమ్మా నాయాలి ముండా! అసలు నువ్వెవురే? ఆడదానివి! నువ్వు యాడుండాల్నో ఆణ్ణే ఉండాల. ఈడ నీకేం పనే?''

''ఈడ నాకేం పన్లేదు. నీకు దణ్ణం పెడ్తా. రాయే కొంపకు బోదాం''

''ఇంకగానా నోర్దెర్సినావో సావగొట్టి సట్లోపెట్తా! పాపం! ఆడకూతురు కొంప మూడారు దోవలై అల్లాడి పోతావుంటే నాబాద నీకేం తెల్సునే? అందుకే తాగినా. ఇంకా తాగతా. నా కడుపుమంట సల్లారేదాకా తాగతా. నేనేం సబకోణ్ణా? యీళ్లందురి మాదిర నోరుమూసుకోని కూసుండేదానికి!''

''ఎవుడి పెండ్లామో యాణ్ణో యాడస్తా ఉండాదని యిక్కడ ఈడేడస్తా ఉండాడు. ఎదురుంగా యాడస్తా ఉండే యీడి పెండ్లాం ఏడుపు యీడికి యినిపించలా? కనిపించలా?'' అని ఆలోచించు కుంటా యిట్ట తిరిగేకుందికి ముత్తారెడ్డన్న!

''ఒరే అబ్బోడా! ఎర్రోళ్లను గురించి ఎందుకు ఆలోచిస్తావురా? ఈ ఎర్రోళ్లేగదరా ఏలేవాళ్లకు కావాల్సింది. పాపం! ఈళ్లేందిరా? ఏడ్సేవాళ్లను చూస్తే ఏడస్తారు. నవ్వేవాళ్లను చూస్తే నవ్వతారు. ఆ పొద్దు సీతమ్మ అడివికి పోతావుంటే 'అలో రామసెంద్రా!' అని ఏడ్సిరి. ఇప్పుడీ రామచంద్రుడి పెళ్లాం కుర్సీదిగి పొయ్యిందని కుమిలి కుమిలి యాడస్తా ఉండారు. అప్పుడూ యింతే! ఇప్పుడూ అంతే! ఎర్రి ఎయ్యిరకాలు. నువ్వు పదరా!'' అనె.

నా ఎర్రిగాక పోతే ఆడ నేనెందుకు నిలబడ్తా! ●